ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	1,01,018	1,01,018
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	3,649.25	4,443.31
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.144 (41.4373)	84,678	1,07,375

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు	లైవ్ : రూ.130	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220

పరిషత్ తొలివిడతకు
నేడు నోటిఫికేషన్



- 18 జడ్పీటీసీ స్థానాలు, 196 ఎంపీటీసీ స్థానాలు
- నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- నోటిఫికేషన్‌పై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు

నల్లగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీసీ రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ విచారణ సాగుతుండగా, ఎన్నికల నిర్వహణపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం స్థానిక ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు తొలివిడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జిల్లాలో తొలివిడతలో 18 జడ్పీటీసీ స్థానాలకు, 196 ఎంపీటీసీ స్థానాలకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. తొలిదశ పరిషత్ స్థానాలకు ఈనెల 23వ తేదీ ఎన్నిక జరగనుంది.

తొలివిడత నల్లగొండ, దేవరకొండ రెవెన్యూ డివిజన్లలో..

జిల్లాలోని 33 మండలాలకు తొలివిడతలో నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 18 జడ్పీటీసీ స్థానాలు, 196 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 9 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాల్లో నామినేషన్లు తీసుకుంటారు. 9న ఉదయం 10గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అధికారులు, అనంతరం ఎంపీటీసీ స్థానాలు, పోలింగ్ కేంద్రాల వారీగా తుదిజాబితాను విడుదల చేస్తారు.10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు. 11వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు. 12న నామినేషన్ల పరిశీలన, ఆదేరోజు

మిగతా 8వ పేజీలో...

తొలివిడత ఎన్నికల షెడ్యూల్ ఇలా...!


ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు	తొలి విడత
నామినేషన్ల స్వీకరణ మొదలు	ఈ నెల 9
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ	ఈనెల 11
నామినేషన్ల పరిశీలన	ఈనెల 12
నామినేషన్ల ఉపసంహరణ	ఈ నెల 15
పోలింగ్ తేదీ	ఈ నెల 23
ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి	నవంబరు 11

మొదటి విడత నల్లగొండ, దేవరకొండ డివిజన్లలో ఎన్నిక జరిగే స్థానాలు..

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ స్థానాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు	లొకేషన్లు
చిట్యాల	12	17,760	17975	0	35,735	60	12
కనగల్లు	12	18313	18579	0	36892	67	33
కట్టంగూరు	13	18,565	18,797	0	37362	63	24
కేతేపల్లి	11	15136	15947	1	31084	55	11
నకిరేకల్	9	13283	13558	2	26843	47	22
నల్లగొండ	13	19166	20063	0	39229	67	32
నార్కట్‌పల్లి	15	21508	22263	1	43772	83	31
శాలిగౌరారం	13	19937	20448	3	40388	70	25
తిప్పర్తి	9	13468	14222	0	27690	48	28
చందంపేట	9	15768	14910	1	30679	64	30
చింతపల్లి	14	22418	22633	3	45054	85	50
దేవరకొండ	11	17909	17806	1	35716	65	41
గుడిపల్లి	5	6066	6205	0	12271	24	13
డిండి	13	20660	20863	2	41525	78	42
గుర్రంపోడు	12	18947	19623	1	38571	74	38
కొండమల్లేపల్లి	9	14992	14604	3	29599	53	30
నేరేడుగొమ్ము	6	10304	9955	3	20262	45	21
పీఏపల్లి	10	13848	13790	6	27644	51	33
మొత్తం	196	298048	302241	27	600316	1099	516

అమ్మో.. ఆఫ్రికా నత్త

- వలస వచ్చిన నత్తలు
- ఉద్యాన పంటలపై దాడి, దిగుబడులపై ప్రభావం
- కూరగాయలు, బత్తాయి, బొప్పాయి పంటలను ఆశిస్తున్న నత్తలు
- గుర్రంపోడు మండలంలో వెలుగులోకి
- అప్రమత్తమైన అధికారులు, శాస్త్రవేత్తలు



ఉద్యాన పంటలకు ఆఫ్రికా నత్తల బెడద మొదలైంది. నత్తల కారణంగా కూరగాయలు, బత్తాయి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. జిల్లాలోని గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన పంటలపై నత్తల దాడి వెలుగులోకి వచ్చింది. దీంతో స్థానిక రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అప్రమత్తమైన ఉద్యాన అధికారులతో పాటు శాస్త్రవేత్తలు ఆయా గ్రామాలను సందర్శించి ఆఫ్రికా నత్తలుగా గుర్తించారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

ఆఫ్రికా నత్తల బెడద కారణంగా ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తగిన సలహాలు, సూచనలు చేసి యాజమాన్య పద్ధతులతో పాటు వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇప్పటికే ఉద్యాన పంటల రైతులు దిగుబడులు రాక, వచ్చిన దిగుబడులకు మద్దతు ధరలు లేక నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆఫ్రికా నత్తలు ఉద్యాన పంటలపై దాడిచేసి నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నత్తలు పెద్ద సంఖ్యలో గుడ్లు పెడుతూ వేగంగా సంతాన ఉత్పత్తి చేయడం వల్ల జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పాటు సరిహద్దు జిల్లాలకు విస్తరించే ప్రమాదం ఉంది.



పిట్టలగూడెంలో నత్తలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి కె.సుభాషిణి, రాజగోప్, మురళి

వలస వచ్చిన ఆఫ్రికా నత్తలు

ఆఫ్రికా నత్తలు దేశంలోని వివిధ ప్రాంతాలకు వందేళ్ల కిందటే వలస వచ్చినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడేళ్ల కిందట తోటలు, పొలాలపై ఆఫ్రికా నత్తలు దాడి ప్రారంభించాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆఫ్రికా నత్తలు విజృంభించాయి. కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి వక్క, శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను నల్లగొండ జిల్లాకు దిగుమతి చేసుకోవడంతో ఆఫ్రికా నత్తలు వాటి వెంట జిల్లాకు చేరి ఉద్యాన పంటలపై ప్రభావం చూపిస్తున్నట్లు శాస్త్రవేత్తలు, అధికారులు గుర్తించారు. ఆఫ్రికా

మిగతా 7వ పేజీలో...



విద్యుత్ దీపాల వెలుగులో లతీఫుల్లా షాఖాద్రి దర్గా స్వాగత ద్వారం

నేటి నుంచి లతీఫుల్లా షాఖాద్రి
ఉర్సు ఉత్సవాలు

ముస్తాబైన దర్గా, నేడు గంధం ఊరేగింపు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక హజ్రత్ సయ్యద్ లతీఫుల్లాషా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు 9న లాంఛనంగా ప్రారంభంకానున్నాయి. ఉర్సు ఉత్సవాలకు దర్గాను అన్ని హంగులతో ముస్తాబు చేశారు. దర్గా ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. గుట్ట మెట్లవద్ద దుకాణాలు వెలిశాయి. 9న సాయంత్రం 5.30 గంటలకు స్థానిక మదీనా మసీద్‌లో గంధానికి ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రికి గుట్ట మెట్ల వద్దకు గంధం చేరగానే ఉర్సు ఉత్సవాలు ప్రారంభవుతాయి. గంధానికి జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై స్వాగతం పలికి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఉర్సు గంధంతో పాటు జిల్లా పోలీస్‌శాఖ గంధాన్ని కూడా ఊరేగింపు తీసుకువస్తారు. ఎస్పీ కార్యాలయంలో ప్రార్థనల అనంతరం ఈ ఊరేగింపును ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రారంభిస్తారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి పంకాలు ఊరేగింపుగా వస్తాయి. ఈ ఊరేగింపులో మర్ఫా వాయిద్యాలు ఆకర్షణగా నిలుస్తాయి. యువకుల నృత్యాలు, భక్తి గీతాలు అలరించనున్నాయి. 10న దర్గాలో దీపారాధన, నిరంతరం భక్తులకు అన్నదానం, పాత కలెక్టరేట్ మసీదులో ఖురాన్ పఠనం, ప్రముఖుల సందేశాలు ఉంటాయి. 11న రాత్రి గుట్ట మెట్ల వద్ద కళాకారుల ఖవ్వాలి ఉంటుంది. ఉత్సవాలు అధికారికంగా మూడు రోజులు జరిగినా, నెల రోజుల పాటు కొనసాగుతాయి. దూరప్రాంతాల భక్తులు ఇప్పటికే నల్లగొండకు చేరుకున్నారు. రాష్ట్రంలోని నలుమూలల ప్రాంతాల నుంచే గాక, ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు హాజరవుతారు. ఇదిలా ఉండగా, దర్గా వద్ద ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు.

రైతులకు ఆందోళన అవసరం లేదు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం విక్రయానికి మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం లోపు తేమ ఉండాలని, రైతులు నేరుగా వచ్చి ధాన్యంతో మార్కెట్‌కు వచ్చి కాంటాలు వేయించే ప్రయత్నం చేయకూడదని అన్నారు. మార్కెట్‌లో ధాన్యం ఆరబెట్టే యంత్రం అందుబాటులో ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 72గంటలలోపు రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ అవుతుందన్నారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలిగినా గ్రీవెన్స్ సెల్ 9963407064కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీసీవో పాత్యానాయక్, మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి, నల్లగొండ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జూకూరి రమేష్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుధాకర్, ఏవో సన్నిరాజు, ఏపీఎం హరి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, తదితరులు ఉన్నారు.



తిప్పర్తి మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

(ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి): రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని గారకుంటపాలెం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, దళారుల మాటలను నమ్మి ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. ఆమె వెంట డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, డీసీఎం సోమయ్య, ఏపీఎం మధుసూదన్, మారెపల్లి లక్ష్మీరెడ్డి, లలిత, సలోమి, నాగమణి, సీసీలు, సిబ్బంది తదితరులు ఉన్నారు. అదేవిధంగా మండలంలోని గుర్రప్పగూడెం, ఆగామోత్కూర్, చిరుమర్తి, పాములపాడు, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీఎం సోమయ్య ప్రారంభించారు.

'కపాస్ కిసాన్' యాప్‌పై అవగాహన కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కలెక్టరేట్): పత్తి కొనుగోలులో రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు 'కపాస్ కిసాన్' యాప్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఉమ్మడి జిల్లా అధికారులకు కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. గత ఏడాది పత్తి విక్రయాల్లో ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం అలాంటి సమస్యలు రాకుండా అవగాహన కల్పించాలన్నారు. యాప్‌లో కౌలు రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులందరూ ఒకేసారి జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకురాకుండా నిర్ణీత షెడ్యూల్‌ను రూపొందించాలని, అందుకు సీసీఐ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద ఓ సహాయకుడిని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గత ఏడాది 3,46,359 మెట్రిక్ టన్నులు పత్తి దిగుబడి వచ్చిందని, అందులో సీసీఐ 1,81,456 మెట్రిక్ టన్నులు, వ్యాపారుల 12,742 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జేడీ శ్రీనివాస్, మార్కెటింగ్‌శాఖ అధికారి ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు చేరని ఓటర్ల జాబితా

నల్లగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి 10 రోజులు గడుస్తున్నా, మరికొన్ని గంటల్లో నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధం అవుతున్నా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఇప్పటికీ ఓటర్ల జాబితాలు ఇవ్వకపోవడాన్ని సీపీఎం నాయకులు నర్సిరెడ్డి ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే గుర్తింపు పొందిన పార్టీలకు ఓటర్ల జాబితాలు ఇవ్వాల్సి ఉంటుందని, ఈ దఫా అలాంటి చర్యలేవీ జిల్లా ఎన్నికల అథారిటీ చేపట్టకపోవడం సరికాదన్నారు. గురువారం అయినా గుర్తింపు పొందిన పార్టీలకు ఓటర్ల జాబితాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఘనంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చిట్టిపోలు యాదగిరి ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలుపుతున్న మిల్లర్లు

సిండికేటైన మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ జగాల్‌రెడ్డి

కనగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సిండికేట్‌గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్న రైస్‌మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దోరెపల్లి స్టేజీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్పీఏ సభ్యుడు రాజురెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐకేపీ కేంద్రాల్లో సరైన వసతులులేక, వాతావరణ పరిస్థితులు అనుకూలించక ధాన్యం ఆరబెట్టడం రైతులకు కష్టతరంగా మారిందన్నారు. దీంతో కొంత మంది రైతులు ధాన్యాన్ని మిల్లులకు విక్రయించేందుకు వెళ్తే తరుగు పేరుతో కోతలు పెడుతూ నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. క్వింటా ధాన్యానికి రూ.1,600 నుంచి రూ.1,700కు మించి చెల్లించడం లేదన్నారు. మిల్లర్లు మద్దతు ధర చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పత్తి కొనుగోలు కోసం సీసీఐ కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట కదిరె నాగరాజు, సైదులు, నర్సింహ, తదితరులు ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జగాల్‌రెడ్డి

నేడు జిల్లాస్థాయి సైన్స్
డ్రామా పోటీలు

డీఈవో భిక్షపతి

నల్లగొండ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు 9న జిల్లా కేంద్రంలోని బీఈడీ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవజాతి ప్రయోజనాల కోసం శాస్త్ర సాంకేతికత అనే ప్రధానాంశంపై ఈ డ్రామా పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి నెంబర్ 9848578845లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులు బాగా చదువుకోవాలి



హాలియా కేజీబీవీని తనిఖీచేస్తున్న అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్

అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ

హాలియా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. బుధవారం హాలియా కస్తూర్బా బాలికల పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలకు ఏం అవసరాలు ఉన్నాయో గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హైమావతికి సూచించారు. వంటగది, పాఠశాల ఆవరణ, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈవో బొల్లారం భిక్షపతి, ఎంఈవో గుండా కృష్ణమూర్తి, తహసీల్దార్ రఘు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, కనగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తామని డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ మండల పరిధిలోని తొరగల్, ఎం.దుప్పలపల్లి, ఖుదావాన్‌పూర్, నర్సింగ్‌భట్ల, పెద్దసూరారం, చిన్నసూరారం, కనగల్ మండలంలోని లింగాలగూడెం, పర్వతగిరి, కనగల్, జీఎడవల్లి, కురంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు కె.పరుశరాం, పద్మ, ఎంపీడీవోలు యాకుబ్‌నాయక్, సుమలత, ఏవో శ్రీనివాస్, డీపీఎం వీరయ్య, ఏపీఎం వినోద, మదరీ పుష్ప, సీసీలు వైగీత, కారింగు శంకర్, రమేష్, ప్రభాకర్, విజయ, ఇద్దయ్య, ఎస్‌ఆర్‌పీ నాగమణి, పాల్గొన్నారు. అదేవిధంగా ఎం.గౌరారం, అమ్మగూడెం గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను ఏపీఎం దానరి వెంకటేశ్వర్‌రావ్, కనగల్ పీఏసీఎస్ కేంద్రాన్ని సీఈవో రామచంద్రారెడ్డి ప్రారంభించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

వైద్యులు సమయపాలన పాటించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కొండమల్లేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి ఓపీ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేశ రవి, వైద్యాధికారి ఉషారాణి, రవి, ఉన్నారు.

నల్లగొండలో భారీ వర్షం

నల్లగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి.

గర్భస్థ శిశువు మృతి

● ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

● నల్లగొండ జిల్లాకేంద్రంలో ఘటన



నల్లగొండ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

నల్లగొండ క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భస్థ శిశువు మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన కడమంచి మహేష్ తన భార్య రేణుకను ప్రసవం నిమిత్తం బుధవారం ఉదయం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చాడు. కడుపులో శిశువు ఆరోగ్యంగానే ఉందని, వారం రోజుల తర్వాత తీసుకురావాలని వైద్యులు చెప్పడంతో బంధువులు ఇంటికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే రేణుకకు పురిటి నొప్పులు మొదలు కావడంతో వైద్యులు పరీక్షలు చేసి కడుపులో ఉన్న శిశువు రెండు రోజుల క్రితమే మృతిచెందినట్లు తెలిపారు. కడుపులో నుంచి మృత శిశువును తీయకుంటే తల్లికి కూడా ప్రాణాపాయం ఉంటుందని శస్త్రచికిత్స చేసి బయటకు తీశారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తారని ఆశతో వస్తే, మృతశిశువును చూడాల్సి వచ్చిందని, ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బంధువులకు నచ్చజెప్పి వారిని అక్కడినుంచి పంపించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని శ్రీరాంపురం రైల్వేస్టేషన్ వద్ద బుధవారం జరిగింది. రైల్వే ఎస్ఐ బి. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ- శ్రీరాంపురం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు నుంచి 40 సంవత్సరాలు వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడని తెలిపారు. మృతదేహంపై నీలిరంగు చొక్కా, బూడిదరంగు ప్యాంట్ ఉందని, ప్యాంట్ జేబులో చలివాగు నుంచి హనుమకొండకు సంబంధించిన బస్సు టికెట్ లభించిందని తెలిపారు. నల్లగొండ రైల్వేస్టేషన్ మాస్టర్ వి. రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే సెల్: 8712658595కు తెలియజేయాని కోరారు.

చికిత్సపొందుతూ..

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. సెప్టెంబరు 6వ తేదీ రాత్రి బైపాస్ రోడ్‌లో గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా తీవ్రగాయాల పాలైన దూపాటి సుబ్బరాజు (55)ను స్థానికులు తొలత ఏరియా ఆస్పత్రికి, అనంతరం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తస్రావం కాగా, శస్త్రచికిత్స నిర్వహించినప్పటికీ కోలుకోకపోవడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సుబ్బరాజు గాంధీ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యువకులపై పోక్సో కేసు నమోదు

సూర్యాపేటరూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన యువకులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ బాలు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం తాళ్లఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన పల్లపు సాయి, రాజు, సాయికుమార్ కొద్దిరోజులుగా బాలికను వేధిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వేరే బజారుకు వెళ్తున్న క్రమంలో ఆ యువకులు కలిసి బాలికను అడ్డగించారు. దీంతో బాలిక కేకలు వేసింది. ఆ సమయంలో బాలిక తల్లి అక్కడికి రావడంతో యువకులు పారిపోయారు. వేధింపులు తట్టుకోలేక బాలిక సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ముగ్గురు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తల్వార్‌తో యువకుల హల్‌చల్




కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలునాయక్

సూర్యాపేటరూరల్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రోజు తల్వార్‌తో హల్‌చల్ చేస్తూ చంపుతామని బెదిరింపులకు గురి చేసిన యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన సూర్యాపేట మండలం యర్కారం గ్రామంలో జరిగింది. బాధితులు ఈనెల 6వ తేదీన సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బుధవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్ కేసు వివరాలు వెల్లడించారు. యర్కారం గ్రామానికి చెందిన బొర్ర సైదమ్మ ఈ నెల 2వ తేదీన తన ఇంటి ముందు నిలబడి ఉంది. అదే సమయంలో గ్రామానికి చెందిన గుండ్లపల్లి నవీన్ పాతకక్షలను మనసులో పెట్టుకుని తన స్నేహితులైనా గుండ్లపల్లి సాయికుమార్, బొర్ర అభిషేక్, చందుపట్ల సందీప్, పిల్లలమర్రి గ్రామానికి చెందినచెరుకుపల్లి అర్జున్ కారులో తిరుగుతూ సైదమ్మ ముందు తల్వార్ తిప్పుతూ నీ కొడుకును, అదే గ్రామానికి చెందిన మారపల్లి సతీష్, మోదాల జానయ్యను చంపుతామని భయభ్రాంతులకు గురిచేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి తాల్వార్, కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ బాలునాయక్, సిబ్బంది ఉన్నారు.

పిడుగుపడి తాటిచెట్టుపై మంటలు

కేతేపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపుల ధాటికి మండల వ్యాప్తంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయిటిపాముల నుంచి మండలానికి విద్యుత్ సరఫరా చేసే 32కేవీ విద్యుత్ లైన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో రాత్రి పొద్దుపోయే వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలోని రామాలయం వెనక వైపున గల ఖాళీ స్థలంలోని తాటి చెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసి తాటిచెట్టు కాలింది. పిడుగుపాటుతో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగనప్పటికీ స్థానికులు భయాందోళనకు గురయ్యారు.



కాలుతున్న తాటిచెట్టు

ఇంట్లో చోరీ.. ఐదు తులాల బంగారం అపహరణ

మఠంపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు ఆదూరి మార్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనారోగ్యం కారణంగా 20రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్నామన్నారు. మంగళవారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగులగొట్టి చొరబడి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

ఉత్తరం..ఓ జ్ఞాపకం

● ఉత్తరాలకు తగ్గిన ఆదరణ ● గతంలో చేతిరాతలకు చిరునామాగా..



ప్రపంచంలోనే అతి పెద్ద తపాలా వ్యవస్థను కలిగిన దేశంగా భారత దేశం తొలి స్థానం లో ఉంది. చేతి రాతలకు చిరునామాగా ఆనాటి ఉత్తరం నిలిచింది. ఉత్తరం ఓ అద్భుత అనుభూతి. సమాచారం ఏదైనా ఎన్నెన్నో మంచి, చెడుల అనుభూతులను అందించే అద్భుత సాధనం. 'తోకలేని పిట్ట 90ఊర్లు తిరిగిందట' అనేది ఒక సామెత.

(ఆంధ్రజ్యోతి-చండూరు)

సార్ పోస్ట్.. మేడమ్ పోస్ట్.. అంటూ పల్లెల్లో పట్టణాల్లో ఉత్తరాలు మోసుకొచ్చే వారధి పోస్టుమాన్. సైకిల్ వచ్చి గంట మోగిస్తూ చేతిలో ఉత్తరాన్ని పెడితే చదవాలనే ఆతృత ఉండేది. సైన్యంలో పహారా కాస్తున్న జవాను తల్లిదండ్రులు, భార్యకు లేఖ ద్వారా ఇచ్చిన సందేశం. నిరుద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన సమాచారం కాల్ లెటర్.. మనసులో మాట చెప్పలేని కవితలు రాసిన ప్రేమ భావం.. సెలవులకు పిల్లలతో కలిసి ఇంటికి రమ్మని పిలుస్తూ కుమార్తె, అల్లుడికి అందించే ఆహ్వానం. క్యాంటిన్ ఖర్చులు, పుస్తకాలకు డబ్బులు పంపించమని నాన్నకు విన్నపం.ఇలా సందర్భం ఏదైనా అన్ని రకాల భావాలను అందించే లేఖను ప్రసుత్తం రాసే వారు కరువయ్యారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు పోస్టల్‌శాఖ వారోత్సవాలు నిర్వహిస్తోంది.

సేవల్లో మార్పులు

తపాలా సేవల్లో మార్పులు వచ్చాయి. ఒకనాడు ఉత్తరాల బట్వాడాకు, మనిఆర్డర్లు పంపేందుకు, పొదుపు పథకాలు అందించేందుకు పోస్టాఫీసులు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. నేడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు సేకరిస్తూ, బీమా పాలసీలు అందిస్తూ బ్యాంకులుగా రూపాంతరం చెందాయి. వ్యక్తిగత, కుటుంబపరమైన ఉత్తరాల ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో పోస్టాఫీసు ద్వారా అధునాతనమైన సేవలు అందించే క్రమంలో మార్పులు చోటు చేసుకుంటున్నట్లు పోస్టల్ అధికారులు చెబుతున్నారు.

రిజిస్టర్ పోస్టులు కనుమరుగు..!

1854 సంవత్సరం బ్రిటీష్ కాలంలో భారతదేశంలోకి ప్రవేశపెట్టిన రిజిస్టర్ పోస్టు సేవలు కనుమరుగు కానున్నాయి. రెండు దశాబ్దాల క్రితం వరకు ప్రజలు పోస్టు బాక్సులతో, ఉత్తరాలతో విడదీయరాని బంధం ఉండేది. బంధువులు, స్నేహితులకు రాసిన ఉత్తరాలు, గ్రీటింగ్ కార్డులు, అభిమాన రచయితలు,సినీతారలకు రాసిన లెటర్స్‌తోపాటు ఊరూ పేరూ లేకుండా రాసే ఆకాశరామన్న ఉత్తరాలు పోస్టుబాక్సుల్లో పడేస్తే చేరాల్సిన చోటుకు చేరేవి.


దేశవ్యాప్తంగా సెప్టెంబరు 31వ తేదీ నుంచి రిజిస్టర్ పోస్టు సేవలు నిలిపివేసినట్లు పోస్టల్ అధికారులు వెల్లడిస్తున్నారు. రెండు దశాబ్దాల నుంచి ఇంటర్‌నెట్, డిజిటల్ కమ్యూనికేషన్‌ల వల్ల సాధారణ పోస్టులు, పోస్టు బాక్సులు గణనీయంగా తగ్గింది. ఇకపై ఈ సేవను స్పీడ్‌పోస్టులో విలీనం చేయడం ద్వారా తపాల శాఖ ట్రాకింగ్‌లో మరింత ఖచ్చిత త్వాన్ని, డెలివరీ వేగాన్ని, ప్రస్తుతం మార్కెట్లో ఉన్న కొరియర్ వ్యవ స్థతో పోటీ పడడంతో పాటు నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 90వ దశకం బట్వాడా జోరుగా కొనసాగింది.

పోస్టుకార్డే సాక్ష్యమైంది

గతంలో అన్నదమ్ముల మధ్య సాగే ఉత్తర ప్రత్యుత్తరాల సంభాషణ చాలా సందర్భాల్లో సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాల విషయంలో పాతికేళ్ల క్రితం అన్నకు రాసిన రాసిన తమ్ముడు ఉత్తరం కోర్టులో సాక్ష్యంగా స్వీకరించి తీర్పు ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పెద్ద మనుషుల ఒప్పందం విషయంలో ఉత్తరమే ప్రధాన పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు.

కోర్టు నోటీసులు, కార్డులకే పరిమితం

ప్రసుత్తం పోస్టుమన్లు, గ్రామాల్లో తిరుగుతున్నారు. తమ పని తాము చేస్తున్నారు. గతంలో ఇచ్చినట్లు ఉత్తరాలు కాదు. ఎక్కువగా కోర్టు నోటీసులు, బ్యాంకు నోటీసులు, ఏటీఎం కార్డులు, ఆధార్ కార్డులు, రిజిస్టర్ పోస్టులకే పరిమితమయ్యారు.



ప్రజలకు చేరువలో సేవలు

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు మరిన్ని సేవలను అందిస్తున్నాం. పోస్టల్‌శాఖలో పలు రకాలైన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రిజిస్టర్ పోస్టు స్థానంలో, స్పీడ్‌పోస్టులో మరింత విస్తృతం చేశాం. తపాల శాఖ ట్రాకింగ్‌లో డెలివరీ వేగాన్ని, ప్రస్తుతం మార్కెట్లో ఉన్న కొరియర్ వ్యవస్థతో పోటీపడి నాణ్యమైన సేవలు అంది స్తున్నాం.

● ప్రసాద్, సబ్ పోస్టుమాస్టర్, చండూరు

బొంబాయి నుంచి ఉత్తరం వస్తే అనుభూతి

నా భర్త 30ఏళ్లుగా ముంబాయిలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఏడాదికోసారి స్వగ్రామానికి వచ్చేది. మా కుటుంబ సభ్యుల యోగ క్షేమాల కోసం ఉత్తరాలు, ప్రత్యుత్తరాలు రాసి తెలుసుకునే వాళ్లం. ఉత్త రం వస్తే ఏమి కబురు పంపారోనని ఆతృతతో, చదువుకున్న వాళ్లతో చదివించుకుని వినేవాళ్లం. అక్కడి నుంచి పిల్లల చదువుల కోసం డబ్బులు మనీయార్డర్ ద్వారా పంపించేవారు. ఇప్పుడు ఆన్లైన్ ద్వారా క్షణాల్లో పంపిస్తున్నారు. ఉత్తరం వస్తే తప్ప కబురు అందేది లేదు. ఇప్పుడు సెల్‌ఫోన్ల రాకతో ఆడియో, వీడియో కాల్ మాట్లాడుకుంటు న్నాం. ఆనాటి అనుభూతులు గుర్తుగానే మిగిలాయి.

● ఎల్లమ్మ గృహిణి,
వలస కార్మికుడి భార్య.

అనుభూతులు మిగిల్చి..

ఒకప్పుడు సందేశాలను పోస్టుకార్డు, ఇన్‌లాండ్ లెటర్‌ల ద్వారా పంపే వారు. అర్జంట్ మెస్సేజ్ అయితే టెలిగ్రామ్‌ల ద్వారా అందజేసేవారు. డబ్బులను మనియార్డర్ ద్వారా పంపిణీ చేసేవారు. వితంతువులకు, పేదవారికి వచ్చే పంఛన్లు మనియార్డర్ ద్వారానే వచ్చేవి. కాల క్రమేణా ఈ సంస్కృతికి ప్రజలు స్వస్తి చెప్పేశారు. తొలత ల్యాండ్ లైన్ టెలీఫోన్లు, ఆ తర్వాత సెల్‌ఫోన్‌లు, ఆండ్రాయిడ్ ఫోన్‌లు వచ్చే సరికి పోస్టుమెన్‌ల ద్వారా వచ్చే ఉత్తరాలు పూర్తిగా కరువయ్యాయి. కానీ గత జ్ఞాపకాలలోకి ఉత్తరం మనకు ఎన్నో ఆనంద అనుభూతులను మిగిల్చింది.

షార్ట్‌సర్క్యూట్‌తో ఎస్‌బీఐలో అగ్నిప్రమాదం

● సకాలంలో స్పందించటంతో తప్పిన ముప్పు ● బ్యాంకు పైభాగంలోని ఫ్లాట్లలో 34 కుటుంబాల నివాసం ● హాలియాలో ఘటన



హాలియా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో వస్తున్న మంటలు




హాలియా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియాలోని ఎస్‌బీఐ(స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. బ్యాంక్ మేనేజర్ మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం రోజు మాదిరిగానే సిబ్బంది బ్యాంకుకు తాళం వేసి వెళ్లి పోయారు. రాత్రి 12.50 గంటలకు మంటలు, పొగ వస్తుండడంతో బ్యాంకు పైభాగంలో ఉండే అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ గమనించి స్థానికులను అప్రమత్తం చేశారు. వారు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో ఎస్ఐ సాయిప్రశాంత్, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో బ్యాంకులోని రెండు కంప్యూటర్లు, రెండు ఏసీలు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, సీలింగ్ కొంతమేర కాలి బూడిదైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని బ్యాంకు ప్రధాన కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు మేనేజర్ మోహన్ తెలిపారు. ఏసీ అవుట్‌డోర్ వల్లనే షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండొచ్చని అగ్నిమాపక అధికారులు అంచనా వేస్తున్నారు. అపార్ట్‌మెంట్ కింది భాగంలో ఎస్‌బీఐ శాఖ నిర్వహిస్తుండగా, పై భాగంలో 34కుటుంబాలు ఆయా ఫ్లాట్లలో నివసిస్తున్నాయి. అగ్నిప్రమాదం జరిగిందని తెలుసుకున్న అపార్ట్‌మెంట్‌వాసులు విద్యుత్ సరఫరా నిలిపివేసి, ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా మంటలను అదుపుచేశారు. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించటంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు బ్యాంకు మేనేజర్ మోహన్ తెలిపారు.

పంట విక్రయానికి 'కపాస్'

● పత్తి రైతుల కోసం ప్రత్యేక యాప్ ● మొబైల్‌ఫోన్లలోనే పంట విక్రయ స్లాట్‌బుకింగ్స్ ● అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చిక్కులు ఇక వదిలినట్టే. గంటలు, రోజుల కొద్దీ వేచి ఉండే అవసరం లేకుండానే ఫోన్‌లోనే స్లాట్‌బుకింగ్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తోంది. ఇందుకోసం కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించింది. గతంలో మీసేవా కేంద్రాల్లో పత్తి రైతులు స్లాట్ బుకింగ్ చేసుకుని సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చేవారు. ఈ సీజన్‌కు సంబంధించి త్వరలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించనున్న నేపథ్యంలో నేరుగా రైతులు ఈ యాప్ ద్వారానే దిగుబడిని కోరుకున్న రోజు, సమయంలో విక్రయించే వెసులుబాటు కలుగనుంది.



(ఆంధ్రజ్యోతి-భానుపురి)

పత్తి కొనుగోళ్ల ప్రక్రియను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకువచ్చింది. ఈ ఏడాది నుంచే పత్తి రైతులు తమ మొబైల్ ఫోన్లలోనే నేరుగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్లాట్ బుకింగ్ చేసుకునే విధానం అమలుకానుంది. రైతులు ఒకసారి స్లాట్ బుకింగ్ చేసుకున్న తర్వాత రాకపోతే మరోసారి బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా మూడుసార్లు స్లాట్ బుకింగ్ చేసుకున్నా దిగుబడిని తీసుకురాకుంటే బ్లాక్ అవుతుంది. అప్పుడు రైతులు వరంగల్‌కు వెళ్లి స్లాట్ బుకింగ్ చేయించుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏడాది	సాగు విస్తీర్ణం	దిగుబడి
2023-24	80వేల ఎకరాల్లో	2,28,518
2024-25	78,079 ఎకరాల్లో	3,33,369
2025-26	83,639 ఎకరాల్లో	5.81 లక్షలు (అంచనా)

సూర్యాపేట జిల్లాలో పత్తి సాగు ఏటేటా తగ్గుతోంది. ఇటీవల నీటి లభ్యత పెరగడంతో వరి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. అయితే పదేళ్ల క్రితం 1.60 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం 83వేల ఎకరాలకు తగ్గిపోయింది. శ్రమతో పాటు క్రిమి సంహారక మందుల ధరలు కూడా పెరగడం, వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు వరి సాగు వైపు మళ్లుతున్నారు.

ఆరుచోట్ల క్రయవిక్రయాలు


జిల్లాలో ప్రతి ఏడాది ఆరు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సూర్యాపేట మండలం బాలెంలలో మంజిత్ కాటన్ పత్తి మిల్లు, తిరుమలగిరిలోని శ్రీనివాసా జిన్నింగ్ మిల్లు, సంతోషిమాత, సిద్ధిఫైబర్, హుజూర్‌నగర్‌లో డాక్టర్స్ గారు అండ్ ఫ్రెండ్స్ కాటన్ మిల్లు, భారతమ్మ కాటన్ మిల్లులలో పత్తి క్రయవిక్రయాలు జరుగుతుంటాయి.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

జిల్లాలో ఆరు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ఈ నెలలో సీసీఐ కేంద్రాలు ప్రారంభమవుతాయి. జిల్లా నుంచి అవగాహన సదస్సుకు వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది సుమారు 170 మంది వెళ్లారు. పొడవు దూదిపింజకు క్వింటాకు రూ.8,110, తక్కువ దూదిపింజకు క్వింటాకు రూ.7,710లను మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

● సంతోష్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, సూర్యాపేట

చింపాంజీ వచ్చింది..
కోతులు పరార్



రాజాపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం మల్లగూడెంలో కోతుల నివారణకు గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు వినూత్న ఆలోచన చేశారు. దీంతో కోతులు పరార్ అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. మల్లగూడెం గ్రామం రిజర్వ్ ఫారెస్టుకు ఆనుకుని ఉంటుంది. గ్రామానికి కోతులు, అడవిపందుల బెడద తీవ్రంగా ఉంది. కోతులు పంటలతో పాటు గ్రామంలోని ఇళ్లలో తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు భోజనాలు తినకుండా ఇబ్బంది కలిగిస్తున్నాయి. అదే విధంగా గ్రామంలో పలువురు మహిళలపై కోతులు దాడి చేయడంతో పలువురు గాయాల పాలయ్యారు. గ్రామ కార్యదర్శి కొండ చక్రధారి ఆన్‌లైన్‌లో రూ.1560లతో చింపాంజీ డ్రెస్సును కొనుగోలు చేశారు. ఆ డ్రెస్సును గ్రామపంచాయతీ సిబ్బందికి వేసి నెల రోజులుగా గ్రామంలో వాడ వాడలా తిప్పుతున్నారు. కోతులు ఉండే ప్రాంతాల్లో తిప్పడంతో కోతులు గ్రామాన్ని వదిలి పారిపోతున్నాయి. దీంతో గ్రామంలో కోతుల బెడద తగ్గిందని గ్రామస్థులు తెలిపారు. పంచాయతీ సిబ్బందిని గ్రామస్థులు అభినందించారు.

మర్రిగూడ బస్టాండ్‌కు మహర్దశ



మర్రిగూడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు నోచుకోలేక అస్తవ్యస్తంగా ఉన్న నల్లగొండ జిల్లా మర్రిగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. మర్రిగూడలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రానికి చెందిన బూర్గు సక్కుబాయి కుమారులు బూర్గు మల్లికార్జున్, కిషోర్, శ్రీనివాస్(దాతలు) ముందుకొచ్చిన తల్లి జ్ఞాపకార్థం రెండు ఎకరాల తన సొంత భూమిని 1999 సంవత్సరంలో నల్లగొండ ఆర్టీసీ డిపో అధికారులకు రిజిస్ట్రేషన్ చేసి విరాళంగా ఇచ్చారు. 26 సంవత్సరాల క్రితం బస్టాండ్ ఏర్పాటు చేశారు. గుర్రంపోడు, నాంపల్లి, చండూరు మండలాల ప్రజలు వ్యాపారాల రిత్యా మాల్‌కు హైదరాబాద్‌కి వెళ్లాలంటే మర్రిగూడ నుంచి వెళ్లాలి. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రం శాలలు, మంచినీటిసరఫరా, విద్యుత్ సరఫరా సక్రమంగా లేవు. దీనికి తోడు బస్టాండ్ ఆవరణంలో గుంతలు పడి వర్షం వస్తే నీటితో నిండి అస్తవ్యస్తంగా తయారవుతుంది. బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రకటనతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాగు ప్రవాహం.. ప్రజల ప్రయాసం



మామిళ్లమడవ-పీర్యానాయక్ తండా గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగు



జాజిరెడ్డిగూడెం- వంగమర్తి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు

మద్దిరాల, అర్వపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో పాలేరు వాగు ప్రవహిస్తోంది. మండలంలోని మామిళ్లమడవ, తూర్పుతండా, దరావత్‌తండా, పీర్యానాయక్‌తండా గ్రామాల ప్రజలు మండలకేంద్రానికి రావాలంటే వాగు దాటాల్సిందే. ఈ సంవత్సరం కురుస్తున్న వర్షాలకు వాగు నిత్యం ఐదు అడుగుల ఎత్తువరకు ప్రవహిస్తోంది. ప్రజలు రేషన్ సరుకులు, పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాగు ఉధృతి ఎక్కువగా ఉంటే చుట్టూ 10నుంచి 15కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. చిన్న పనులకు సైతం ట్రాక్టర్లు వాడాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో వాగు దాటాలంటే భయభయంగా వెళ్తామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు అర్వపల్లి మండలంలోని జాజిరెడ్డిగూడెం- వంగమర్తి గ్రామాల మధ్య ఉన్న మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ పరివాహక ప్రాంత రైతులు వరద వచ్చేటప్పుడు వెళ్లవద్దని తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ సైదులు సూచించారు.



హుజూర్‌నగర్‌లో డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు విద్యార్థుల్లా..

హుజూర్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానుగుణంగా బోధనలో తీసుకువస్తున్న మార్పులపై సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ప్రతీ ఉపాధ్యాయుడు ల్యాప్‌ట్యాప్‌ను ముందు పెట్టుకుని శ్రద్ధగా శిక్షణ పొందారు. విద్యార్థుల్లా శిక్షకులు చెబుతున్న వాటిని ఆలకించారు. తరగతుల్లో డిజిటల్ బోధనకు అవసరమయ్యే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ శిక్షణా తరగతులను ఎంఈవో సైదానాయక్ బుధవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు డిజిటల్ లెర్నింగ్‌తో బోధన చేయాలని కోరారు. విద్యార్థులకు డిజిటల్ బోధనతో అభ్యాసన అందించాలన్నారు. విద్యార్థుల్లో కొత్త తరహా బోధన అలవాటు చేయాలన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను అవగాహన చేసుకుని బోధన చేయాలన్నారు. డిజిటల్ పాఠాలను అందించి విద్యార్థుల ఉన్నతాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి, రిసోర్స్ పర్సన్స్ జాఫర్, సైదులు, బ్రహ్మం, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి చెర్వు వద్ద యువకులతో మాట్లాడిస్తున్న ఎస్‌ఐ క్రాంతికుమార్

యువకులను హెచ్చరించి.. వారితోనే చెప్పించి

నార్కట్‌పల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈత కొట్టాలనే సరదాను విషాదంగా మార్చుకోవద్దని యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చిన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ ఆయా సూచనలను వారితో వీడియోలో చెప్పించి, సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి పెద్దచెరువు నిండి కొన్నిరోజులుగా అలుగు పోస్తుండటంతో చెర్వువద్దకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఈ నెల 4న మండలంలోని జువ్విగూడెం శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలోని నీటిసంప్‌లోకి ఈతకు దిగి ఇద్దరు యువకులు మునిగి చనిపోయారు. ఈ నేపథ్యంలో బుధవారం నార్కట్‌పల్లి పెద్దచెర్వు అలుగును ఎస్‌ఐ క్రాంతికుమార్ సందర్శించారు. చెర్వు అలుగు వద్ద ప్రమాదకర భంగిమల్లో కొందరు యువకులు సెల్ఫీలు తీసుకోవడం, అలుగుపై నడుస్తూ వీడియోలు చేస్తుండగా ఎస్‌ఐ వారిని హెచ్చరించారు. సరదా పేరిట చెర్వులోకి దిగవద్దని చెర్వుల్లో పెరిగిన నాచు, కంపచెట్లు ప్రమాదకరంగా ఉంటాయని హెచ్చరించారు. అదే సమయంలో ఎస్‌ఐ సూచనలను వీడియో రికార్డింగ్ ద్వారా ఆ యువకులతోనే చెప్పించి ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయించాడు. ఎస్‌ఐ చేసిన ఈపనిని అందరూ అభినందించారు.



గాజులగూడెంలో కళాజాత నిర్వహిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

తుంగతుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని, తల్లిదండ్రులకు భారం కావద్దని తెలంగాణ సాంస్కృతిక సారథి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం తుంగతుర్తి మండలం గాజులగూడెం గ్రామంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, సమాచార సంబంధాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు కళాజాత ద్వారా గ్రామంలో సామాజిక బాధ్యతలు, మత్తుపదార్థాలతో అనర్థాలపై అవగాహన పెంచారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పాన్ మసాలా, గుట్కా నిషేధంపై ప్రజలకు కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో యువత తమ బంగారు భవిష్యత్‌ను కోల్పోతుందన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండి, విద్యా, ఉపాధి మార్గాల వైపు యువత దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా ప్రధానకార్యదర్శి పల్లెల రాము, టీం లీడర్ పల్లెల లక్ష్మణ్, కళాబృందం సభ్యులు గంటా భిక్షపతి, గడ్డం ఉదయ్, మాగి శంకర్, పాక ఉపేందర్, మద్దిరాల మంజుల తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా

● మౌలిక వసతుల కల్పనకు కృషి ● యాదగిరిగుట్ట ఇన్‌చార్జి ఈవో రవినాయక్



అధికారులకు సూచనలు చేస్తున్న రవినాయక్, స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. క్షేత్ర పరిసరాల్లో మౌలిక వసతులను రవినాయక్ బుధవారం పరిశీలించారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆదిస్థాయిలో ఏర్పాట్లు చేసేందుకు అధికారులతో కలిసి పర్యటించారు. కియోస్క్ యంత్రాలు, మెట్ల మార్గం, మెట్ల వెంట విద్యుత్ దీపాల ఆవశ్యకత తదితర అంశాలను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేశారు. ముందుగా ఆలయ ఉత్తర తిరువీధిలో డిజిటల్ సేవల ద్వారా ప్రసాదాలు పొందే కియోస్క్ యంత్రాలను పరిశీలించారు. మూడు రోజులుగా నిలిచిపోయిన నగదు రహిత సేవల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించి తిరిగి అందుబాటులోకి తెచ్చారు. యంత్రాల పనితీరు, అదే దారిలో తాగునీటి సరఫరాను పరిశీలించారు. శివాలయంనుంచి వైకుంఠద్వారం వెళ్లే మెట్లమార్గాన్ని తనిఖీ చేశారు. విద్యుత్ దీపాలను త్వరగా ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ విభాగం ఈఈ ఊడెపు వెంకటరామరావును ఆదేశించారు. నాణ్యతతో కూడిన స్వచ్ఛమైన మంచినీళ్లు భక్తులకు నిరంతరంగా సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 9,80,860 ఆదాయం సమకూరినట్టు ఇన్‌చార్జి ఈవో గుగులోత్ రవినాయక్ తెలిపారు.

ఘనంగా జైవీర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తల సమక్షంలో హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే తెల్లవారుజామునే శ్రీశైలం మల్లిఖార్జునస్వామిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో మార్గంమధ్యలోని రంగారెడ్డిగూడెం స్టేజీ వద్ద కార్యకర్తలు జైవీర్‌కు ఘనస్వాగతం పలికి క్రేన్ సహాయంతో భారీ గజమాలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో హాలియాకు వచ్చి కార్యకర్తలు ఏర్పాటుచేసిన కేక్‌లను కట్‌చేశారు. అనంతరం అభిమానులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, చింతల చంద్రారెడ్డి, గాలి రవికుమార్, విజయేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, అంకతి సత్యం, వల్లపురెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గౌని రాజారమేష్ యాదవ్, కుకుడాల ఆంజనేయులు, సాగర్‌రెడ్డి, మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, నాగరాజు, నాగిరెడ్డి, మజార్, ఆంజనేయులు, అశోక్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణానాయక్, యాదగిరి పాల్గొన్నారు.

మిల్లర్ల శుభాకాంక్షలు

జైవీర్ జన్మదినాన్ని పురస్కరించుకొని హాలియా, నిడమనూరు మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రైస్ మిల్లర్లు చిట్టిపోలు కరుణాసాగర్, కుక్కడపు రమేష్, రామాంజిరెడ్డి, చిట్టిపోలు యశ్వంత్, హేమంత్, చేకూరి వంశీ, కజ్జెం సంతోష్, యాదయ్య, రంజిత్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



జైవీర్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

అమ్మో.. ఆఫ్రికా నత్తలు

(5వ పేజీ తరువాయి)

నత్తలు గుడ్లను ఏటా జూలై నుంచి ఫిబ్రవరిమాసంలో పెడతాయి. ఒక్కో నత్త 100నుంచి 400వరకు కూడా గుడ్లు పెడతాయి. దీని జీవితకాలం ఐదేళ్లనుంచి ఆరేళ్ల వరకు ఉంటుంది. ఈ సమయంలోనే ఒక్కో నత్త సుమారు 1,000 నుంచి 1,200 పిల్లలకు జన్మనిస్తుండటంతో సంతతి పెరుగుతోంది. నత్తలు తుప్పలు, ఆకుల కింద వెలుతురు తగలని ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తుంటాయి. బొప్పాయి, అరటి, జామ, కూరగాయాలు, మొక్కజొన్న, పత్తి, పప్పు, ఆయిల్‌పామ్ పంటలతో పాటు నర్సరీలను ఆశ్రయించి పంటలను దెబ్బతీస్తున్నాయి. నీరు ఎక్కువగా ఉండే వరి పంటలను ఆఫ్రికా నత్తలు ఆశిస్తాయని అధికారులు చెబుతున్నారు. నత్తలు చిత్తడి నేలల్లో అధికంగా నివాసం ఏర్పాటుచేసుకుంటాయి.

ఆఫ్రికా నత్తల నివారణకు చర్యలు


- ఆఫ్రికా నత్తల నివారణకు ఒక కిలో ఉప్పును నాలుగు లీటర్ల నీటిలో కలిపి ఆ నీటిలో గోనే సంచిని తడిపి గట్లపై వేస్తే ఈ సంచులపైకి వెళ్లిన నత్తలు ద్రావణం ఘాటుకు చనిపోతాయి.
- ఆకర్షక ఎర ఏర్పాట్లలో భాగంగా 10కిలోల వరి తవుడుకు ఒక కిలో బెల్లం, ఒక లీటర్ ఆముదం, ఒక కిలో తయోడికార్బ్ గుళికలు లేదా ఎసీపేట్ లేదా క్లోరోపైరీపాస్ కలిపి చిన్న ఉండలుగా చేయాలి. ఈ ఉండలను బొప్పాయి, క్యాబేజీ ఆకుల కింద పెట్టాలి. వీటిని తిన్న ఆఫ్రికా నత్తలు చనిపోవడం లేదా నిర్వీర్యం అయిపోతాయి. వారానికి రెండు మూడు రోజుల వరకు ఇలా చేస్తూ ఉండటంతో పాటు నత్తలను ఏరివేసే సమయంలో చేతికి గ్లౌజ్‌లను తప్పనిసరిగా ధరించాలి.
- రెండు గ్రాముల కాపర్ సల్ఫేట్, రెండు గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ లీటర్ నీటితో పిచికారీ చేయాలి. దీంతో 70శాతం నత్తలు చెట్ల నుంచి కింద పడిపోతాయి. వీటిని ఏరి కాల్చివేయాలి. అదేవిధంగా రెండు గ్రాముల మెటలాడీహైడ్, 2.5శాతం గుళికలు భూమిపైన చెట్ల మొదళ్లలో చల్లాలి.

రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు

- ఇతర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకువచ్చే సమయంలో నత్తల గుడ్లు, చిన్న చిన్న నత్తల వంటివి ఉన్నాయామో నని జాగ్రత్తగా గమనించాలి. అవి ఉంటే వాటిని నిర్మూలించిన తరువాతే మొక్కలు తెచ్చుకోవాలి.
- పండ్ల తోటలను ఒత్తుగా వేసుకోకూడదు.
- తోటల్లో కలుప, చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలి.
- అంతర్ సేద్యంపై దృష్టిసారించాలి.
- రాత్రి వేళల్లో తోటల్లో నీరు పారించకూడదు.
- తోటల్లో బాతులు, కోళ్లను పెంచాలి.

ఎగువ నుంచి తగ్గిన వరద

● సాగర్ 6 గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జునసాగర్ ఆరు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు బుధవారం ఎగువ నుంచి వరద రాక తగ్గింది. ఈ నెల 7వ తేదీన 2,29,422 క్యూసెక్కుల వరద రాగా, బుధవారం 1,01,018 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 589.70 అడుగులుగా(311.1486టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 8,022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,942 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 600 క్యూసెక్కులు, 6 గేట్లనుంచి 48,414 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,01,018 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి అంతే మొత్తంలో వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో...

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి దిగువన గల మూసీ రిజర్వాయర్‌లో చేరుతోంది. మంగళవారం సాయంత్రానికి 5854.59 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం సాయంత్రానికి కొంతమేర తగ్గి 3649.25క్యూసెక్కులుగా నమోదయ్యింది. రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే వీలుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు, మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644.05అడుగులు(4.21టీఎంసీలు)ల గరిష్ఠ స్థాయిలో ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టాన్ని ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగితే ప్రాజెక్టు గేట్ల నిర్వహణకు ఇబ్బందిలేకుండా ఉండేందుకు వీలుగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా అధికారులు ఎగువ నుంచి వస్తున్న వరదకు అనుగుణంగా ప్రాజెక్టు 2, 3, 4, 8వ నెంబర్ క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తి 3912.66క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు విడుదలవుతున్న మరో 483.30 క్యూసెక్కుల నీటిని కలుపుకుని ప్రాజెక్టు నుంచి మొత్తం 4443.31క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు), ప్రస్తుత నీటిమట్టం 643.90అడుగులు(4.17టీఎంసీలు)గా ఉంది.

మోటారు వేయకున్నా.. ఆగని నీటి ధార

● బీ.వెల్లెంల ఉదయ సముద్రం కాల్వలో మోటారు వేసిన రైతు ● మడి నిండిందని మోటారు ఆఫ్ చేసినా పైప్‌ల నుంచి వస్తున్న నీరు



మోటారు బంద్ చేసినా పైప్ నుంచి వస్తున్న నీరు

నార్కట్‌పల్లి, అక్టోబరు 8, (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల మట్టం పెరిగితే బోరు మోటార్ల నుంచి నీళ్ల ఫౌంటెయిన్ లాగా ఎగిసిపడడం మనం చూస్తుంటాం. కానీ పొలానికి నీళ్ల పెట్టడానికి కాల్వనీటిలో వేసిన పైప్ నుంచి నీళ్ల బోరు బంద్ చేసినా ఆగకుండా పోస్తోంది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల గ్రామానికి చెందిన సోమనబోయిన మల్లయ్య అనే రైతు ఇదే గ్రామస్థుడైన ఓ రైతుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని వరిసాగు చేస్తున్నాడు. ఆ రైతు కౌలుకు తీసుకున్న వ్యవసాయ భూమి బీవెల్లెంల ఉదయ సముద్రం సాగునీటి కాల్వ పక్కనే ఉంది. దీంతో 5 హెచ్‌పీ సామర్థ్యం గల మోటారును కాల్వలో వేసి తన పొలానికి సాగునీటిని అందిస్తున్నాడు. పొలానికి కావల్సినంత నీళ్లు అందడంతో రెండు రోజుల కిందట సాయంత్రం వేళ నీటి మోటారును బంద్ చేసి ఇంటికెళ్లాడు. మరుసటి రోజు తెల్లవారుజామున పొలానికి రాగా బంద్ చేసిన మోటారు పైప్ నుంచి నీళ్ల రావడం చూసి ఆశ్చర్యపోయాడు. తాను కాల్వలో వేసిన మోటారును బంద్ చేసినా ఎలా నీళ్ల వస్తున్నాయో అర్థం కాక మరోసారి మోటారును ఆఫ్ చేసి చూశాడు. మోటారు నడిచినపుడు వచ్చేంత కాకపోయినా కొంత ధార పరిమాణం తగ్గినా పైప్ నుంచి నీళ్ల రావడం మాత్రం ఆగడం లేదు. కాల్వలో ప్రస్తుతం నీటి విడుదల జరుగుతున్న కారణంగా నీటి ప్రవాహ ఒత్తిడితోనే మోటారు ఆఫ్ చేసినా పైప్ ద్వారా నీళ్ల వస్తున్నాయని మరికొందరు రైతులు చెబుతున్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వాన

అవరోధాలను అవకాశాలుగా మలుచుకోవాలి

● విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర్‌రావు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ జీవితంలో ఎదరైన అవరోధాలను, సవాళ్లను నూతన అవకాశాలుగా మార్చుకొని ముందుకు సాగాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర్‌రావు అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామశివారులోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం తరగతుల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమ అడ్డంకులను అవకాశాలుగా మార్చుకొని ముందుకు సాగినప్పుడే తమ లక్ష్యాలను సాధించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా ప్రోత్సహిస్తే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు. విద్యార్థులు కెరీర్‌లో రాణించడానికి ఆత్మవిశ్వాసం, నమ్మకం, క్రమశిక్షణ, శ్రద్ధతో చదువు కొనసాగించాలన్నారు. లక్ష్యాన్ని ఛేదించడంలో పట్టుదలే పెద్ద పెట్టుబడి అని అన్నారు. పట్టుదలతోనే తమ లక్ష్య సాధన సాకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ సరిత సత్పతి మాట్లాడుతూ ఎంబీఏ పూర్తిచేసిన విద్యార్థులకు కెరీర్‌లో స్థిరపడడానికి అపారమైన అవకాశాలున్నా యని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల సంస్థల్లో ఫైనాన్స్/మార్కెటింగ్/హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ తదితర హోదాల్లో నియమితులు కావడానికి ప్రధాన వృత్తిపరమైన కోర్సు అని తెలిపారు. ఉన్నత స్థానాలకు చేరుకోవడం సైతం సులభమ వుతుందన్నారు. తమ యూనివర్సిటీలో ఎన్‌ఈపీ-2020ను అనుసరి స్తామని, అత్యుత్తమ ఫ్యాకల్టీ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ విభాగాల డీన్‌లు, డైరెక్టర్లు, అధిపతులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ దాసేశ్వర్‌రావు

ఆంధ్రజ్యోతి ****
నల్లగొండ
నకిరేకల్, మునుగోడు
8 www.andhrajyothy.com ● గురువారం 9 అక్టోబరు 2025

పాఠశాలకు టీవీ బహూకరణ

చిట్యాలరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనిపాకలకు చెందిన పీక పృథ్వీరాజు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించాడు. విద్యార్థులకు సాంకేతిక విద్య అందేలా అదే పాఠశాలకు బుధవారం 43 ఇంచుల టీవీని ప్రధానో పాధ్యాయురాలు కౌసల్యకు అందజేశాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు రైతు వేదికలో ఏర్పాట్లు

నార్కట్‌పల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయ దల్చిన అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో కత్తురోజు ఉమేష్‌చారి తెలిపారు. నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని రైతువేదికలో నామినేషన్ల స్వీకరణ కోసం 5 కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రూ. 109 కోట్లతో పట్టణ అభివృద్ధి

సయ్యద్ ముసాబ్ అహ్మద్, కమిషనర్



నల్లగొండ పట్టణంలో వచ్చే ఏడాదిలోగా రూ.109 కోట్లతో పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జరిగే పనుల గురించి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(రామగిరి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఎక్కడా అభివృద్ధి జరుగుతున్నట్లు లేదు?

కమిషనర్: స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ. 109 కోట్ల పట్టణంలో గొల్లగూడ శ్మశానవాటిక, వరద కాల్వలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాం. మరికొద్ది రోజుల్లోనే ప్రారంభం కానున్నాయి. వీటికి సంబంధించి సెప్టెంబరు నెలలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయింది.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

కమిషనర్: అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వారు ఎంతటివారైనా చర్యలు తీసుకోకతప్పదు.

ఆంధ్రజ్యోతి: ఆస్తి పన్ను బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి? వాటిని ఎలా వసూలు చేస్తారు?

కమిషనర్: పేరుకుపోయిన బకాయిలను వసూలు చేసేందుకు మొట్ట మొదటగా టాప్ 500 బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తాం. నోటీసులకు స్పందించకపోతే వారి ఇళ్లను జప్తు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఆంధ్రజ్యోతి: అక్రమ నల్లా కనెక్షన్ల పరిస్థితి ఏమిటి?

కమిషనర్: పట్టణంలో అక్రమ నల్ల కనెక్షన్లను గుర్తించేందుకు వార్డు ఆఫీసర్లతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాం. గుర్తించిన అక్రమ కనెక్షన్లు వెంటనే ఆన్‌లైన్ కూడా చేయిస్తాం.

ఆంధ్రజ్యోతి: పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: ప్రత్యేకంగా పారిశుధ్యంపైనే ప్రత్యేక దృష్టి సారించాం. ఇందులో భాగంగా వల్లభరావు చెరువును క్లీనింగ్ చేపట్టే కార్యక్రమాన్ని తీసుకున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు మురుగుకాల్వలో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ వెల్నెస్ కార్యక్రమం

కట్టంగూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాందీపని పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్స్ అధ్వర్యంలో ఫ్యామిలీ వెల్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మ మాట్లాడారు. కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ సభ్యుడు శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా సమతుల్యం సాధించడం అవసరమన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, ఒకరినొకరిని అర్థం చేసుకోవడం, సహకారం పెంపొందించుకోవాలన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, పి.రాములు, బనహోజు వినోద్‌కుమార్ ఉన్నారు.

వైకుంఠధామంలో డంపింగ్

● *అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు*

తిప్పర్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యంపై పట్టింపు లేకుండా పోతోంది. స్వచ్ఛత, పరిశుభ్రత, అభివృద్ధి మాటలు వినబడటం లేదు. తిప్పర్తి మండలంలో అధికారుల తీరు నిర్లక్ష్య పాలనకు నిలువుటద్దంలా మారింది. మండలంలో సమస్యలు తిష్ట వేశాయి. అధికారుల పాలనలో గ్రామ పంచాయతీల్లో కనీసం చేయాల్సిన పనులు కూడా చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సర్పంచుల పదవీ కాలం పూర్తయిన నాటి నుంచి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలకేంద్రంలోని డంపింగ్ యార్డులో ఇష్టానుసారంగా చెత్తను పడవేస్తున్నారు. అంతేకాక తిప్పర్తి మండల కేంద్రం నుంచి మిర్యాలగూడెం రోడ్డు వైపునకు నూతనంగా చేపట్టిన రోడ్డు పనులను కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నాలా క్లియర్ చేయకపోవడంతో అటుగా వచ్చిన వరదనీరంతా డంపింగ్ యార్డుతో పాటు వైకుంఠధామం, విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వెళ్తుంది. కనీసం అందులోకి చేరుతున్న నీటిని దారిమళ్లించే ఏర్పాట్లు కూడా చేయయడం లేదు.



నీరు వెళ్లడానికి అడ్డంగా ఉన్న రోడ్డు

కాటి దగ్గర కంపు

గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహనసంస్కారాలు చేయడానికి వైకుంఠధామానికి వెళ్తారు. ఆ సమయంలో అక్కడికి వెళ్లిన వారికి ఆ పరిసర ప్రాంతాలను చూసి ఎక్కువ బాధ కలిగించేలా పరిసరాలు మారాయని స్థానికులు చెబుతున్నారు. పరిశుభ్రంగా లేని ఆ ప్రదేశంలో దహన సంస్కారాలు నిర్వహించి, అదే చెత్త వేసిన చోటనే బంధువులు స్నానాలు చేస్తూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. పలు మార్లు తిప్పర్తి మండలానికి వస్తున్న జిల్లా అధికారులు అదే రోడ్డుపై నుంచి వెళ్తున్నా కనీసం ఆరా తీయకుండా వెళ్లడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తిప్పర్తి మండల కేంద్రంలోని వైకుంఠధామంలో వేసిన చెత్తాచెదారం, చేరిన వర్షపు నీరు

డంపింగ్ యార్డును మార్చాలి



తిప్పర్తి మండల కేంద్రంలోని వైకుంఠధామంలో ఏర్పాట్లు పూర్తిచేయాలి. ఆ పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా దర్శనమిస్తుండటంతో అటుగా వెళ్లే ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని వెంటనే నీటిని మళ్లించాలి. వైకుంఠధామంలో చెత్త వేయడం నిలిపివేయాలి.

- ఆకిటి లింగయ్య తిప్పర్తి గ్రామస్థుడు

ధాన్యం కొనుగోళ్లకు 11 కేంద్రాల ఏర్పాటు

● *మండలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు*

కేతేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు కేతేపల్లి మండలంలో 11కేంద్రాల ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. మూసీ, ఏఎమ్మార్పీ ఆయకట్టుతో పాటు బావులు, బోర్ల నీటి సాయంతో మండలంలో దాదాపు 21వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. సాగుబడి మేరకు 4.30 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. దీంట్లో దాదాపు 3.60 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. మండలంలోని 16గ్రామ పంచాయితీలకు 5 గ్రామాల్లో పీఏసీఎస్, 3 గ్రామాల్లో డీసీఎంఎస్, మరో 3 గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. మండలంలోని చీకటిగూడెం, చెరుకుపల్లి, తుంగతుర్తి, కొప్పోలు, కొర్లపహాడ్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఏర్పాటు చేయనుంది. అలాగే ఇప్పలగూడెం, ఇనుపాముల, కొండకిందిగూడెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను డీసీఎంఎస్ నిర్వహించనుంది. ఇక గుడివాడ, బొప్పారం, కొత్తపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఆయా గ్రామాల్లో ఇప్పటికిప్పుడు కేంద్రాల ఏర్పాటుకు పీఏసీఎస్, డీసీఎంఎస్, ఐకేపీలు సిద్ధంగా ఉన్నా వరి కోతలు నామమాత్రంగా సాగుతుండటం, వరి కోసిన రైతులు తమ పచ్చి ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు విక్రయిస్తుండడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మరో వారంరోజులు పట్టే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేలోపు దాదాపు 20 శాతం మేర వరి ధాన్యం మిల్లర్ల వద్ద నేరుగా రైతులు విక్రయించుకునే వీలుందని భావిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కట్టంగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

కట్టంగూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పుష్పలత అన్నారు. కట్టంగూరులోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు, సీఈవో బండ మల్లారెడ్డి, సిబ్బంది చంద్రయ్య, సైదమ్మ, సరోజ ఉన్నారు.



ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన నల్లగొండ పట్టణంలోని లతీపుల్లా షాఖాద్రి దర్గా

నేడే నోటిఫికేషన్

(5వ పేజీ తరువాయి)

సాయంత్రం చెల్లుబాటయ్యే నామినేషన్ల సంఖ్యను అధికారులు ప్రకటిస్తారు. 15వ తేదీ సాయంత్రం 3గంటలవరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు సాయంత్రం 3గంటల తర్వాత బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 23వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఏ కేంద్రంలోనైనా రీపోలింగ్ అవసరమైతే ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు మరునాడు ఎన్నిక నిర్వహిస్తారు. 23వ తేదీ పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు. నవంబరు 11వ తేదీ ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, లెక్కింపు పూర్తయిన వెంటనే విజేతలను ప్రకటిస్తారు.

నోటిఫికేషన్ జారీకి అంతా సిద్ధం : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీన మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడారు.

మొదటి విడత 18 జడ్పీటీసీలు, 196 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందుకు ఆర్వోలు, ఎంపీడీవోలకు శిక్షణ పూర్తి చేశామని వివరించారు. నామినేషన్ కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. అంతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

కట్టంగూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ అన్నారు. మండలంలోని కలిమెర గ్రామంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ బాకీ కార్డుతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నారెగూడేనికి చెందిన ఆకుల సైదులు, డెంకల సైదులు, ఆకుల నరేష్‌లతో పాటు వివిధ పార్టీల నాయకులు సుమారు 20మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ సూది రెడ్డి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు ఉట్కూరి ఏడుకొండల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, గుండాల మల్లేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపైనే మురుగు

మర్రిగూడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యరగండ్లపల్లి డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైనే పారుతోంది. రోడ్డు స్థలాన్ని కొందరు ఆక్రమించడంతో ఈ సమస్య ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపై నిల్వకుండా, రోడ్డు ఇరువైపులా డ్రైనేజీలను ఏర్పాటు చేసి, ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మంత్రి పొన్నం బేషరతుగా క్షమాపణ చెప్పాలి

నల్లగొండటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులానికి చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను మహనీయుల ఆశయ సేవా సంఘం (మాస్) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ పెరిక కరణ్ జయరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి వ్యాఖ్యలు షెడ్యూల్ కులాన్ని, సమాజాన్ని కించపరిచే విధంగా పరిగణించాల్సి వస్తుందన్నారు. బాధ్యత గల మంత్రి తోటి నిమ్న కులాలను అవమానించడం సరికాదని అన్నారు. వెంటనే మంత్రి పొన్నం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిచో షెడ్యూల్ కులానికి చెందిన షెడ్యూల్ కులాల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాస్ జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్ కుమార్, నాయకులు కత్తుల షణ్ముఖ కుమార్, కొండేటి వెంకట్, చింత శివరామకృష్ణ, కత్తుల సన్నీ, విరిగి ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుల ఖండన

మంత్రి పొన్నం ప్రభాకర్ తన సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పోలే జయకుమార్, తొలకొప్పుల గిరి, కత్తుల సైదులు ఒక ప్రకటనలో త్రీవంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృత్తం కాకుండా చూసుకోవాలన్నారు.

అసమానతల అంతమే కేవీపీఎస్ లక్ష్యం

● *కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున*



కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకల్లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున

నల్లగొండ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దేశంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న కుల, ఆర్థిక అసమానతలను నిర్మూలించడం కేవీపీఎస్ యొక్క అంతిమ లక్ష్యమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా బుధవారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని ప్రత్యేక అసమానతలు ఈ దేశంలో కుల వ్యవస్థ రూపంలో కొనసాగుతున్నాయి. వీటివల్ల దేశం వెనుకబడిపోగా, మనిషిని సాటి మనిషిగా చూడని నీచత్వం ఇంకా కొనసాగుతోందని అన్నారు. కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు గాదె నరసింహ, ఒంటెపాక కృష్ణ, బొల్లు రవీందర్, దండు రవి, మల్లయ్య, తక్కెళ్లపల్లి శ్యామ్, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

విధిగా పరిశుభ్రత పాటించాలి : యాదమ్మ



పిల్లలకు సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్ యాదమ్మ

చండూరురూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బాలింతలు, తల్లులు, గర్భిణులు, పిల్లలు ఐచ్ఛితంగా తమ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రత కూడా విధిగా పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ సూచించారు. మండల పరిధిలోని కస్తాల గ్రామంలో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా బాలింతలకు తల్లి పాలు, ముర్రుపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అదే విధంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆరు నెలలలోపు పిల్లలపై తల్లులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా మూడు నెలలలోపు బాలింతల ఇళ్లను తాము సందర్శించి పలు సూచనలు, జాగ్రత్తల గురించి వివరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశావర్కర్, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చే వారితో బలం ఉన్న స్థానాల్లో నిలబడతాం




శాలిగౌరారం సమావేశంలో మాట్లాడుతున్న కందాల ప్రమీల

శాలిగౌరారం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని మాకు బలమున్న స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెడతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాకు బలం ఉన్న స్థానాల్లో మాతో కలిసి వచ్చే వారితో కలిసి పోటీ చేస్తామని అన్నారు. శాలిగౌరారం మండలానికి ఎంతో చరిత్ర ఉందని, ఆనాటి సాయుధ రైతాంగ పోరాటం నుంచి ఈనాటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండేది కమ్యూనిస్టు పార్టీ, ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా బిడ్డలను గెలిపిస్తే ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని ఆమె తెలిపారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు దాసరి దేవచిత్తం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులు మక్క బుచ్చి రాములు, ఎర్ర రమేష్, కారింగుల వెంకన్న, ఎస్‌కె.ఇస్మాయిల్, అన్నెబోయిన కిరణ్, డెంకెల లింగయ్య, గుండ్లపల్లి వెంకన్న, బట్ట అవనిజ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మునుగోడురూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జమస్థాన్‌పల్లి గ్రామంలో నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ అందుగుల కుశ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కుశ కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం పంపించగా బుధవారం కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంతంగి పద్మ స్వామి, నాయకులు జాజుల స్వామి గౌడ్, జాజుల శంకర్, జీనుకుంట్ల ముత్యాలు, అందుగుల యాదయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	1,01,018	1,01,018
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	3,649.25	4,443.31
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.144 (41.4373)	84,678	1,07,375

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

పరిషత్ తొలివిడతకు
నేడు నోటిఫికేషన్



- 18 జడ్పీటీసీ స్థానాలు, 196 ఎంపీటీసీ స్థానాలు
- నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- నోటిఫికేషన్‌పై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు

నల్లగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీసీ రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ విచారణ సాగుతుండగా, ఎన్నికల నిర్వహణపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం స్థానిక ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు తొలివిడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జిల్లాలో తొలివిడతలో 18 జడ్పీటీసీ స్థానాలకు, 196 ఎంపీటీసీ స్థానాలకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. తొలిదశ పరిషత్ స్థానాలకు ఈనెల 23వ తేదీ ఎన్నిక జరగనుంది.

తొలివిడత నల్లగొండ, దేవరకొండ రెవెన్యూ డివిజన్లలో..

జిల్లాలోని 33 మండలాలకు తొలివిడతలో నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 18 జడ్పీటీసీ స్థానాలు, 196 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 9 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాల్లో నామినేషన్లు తీసుకుంటారు. 9న ఉదయం 10గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అధికారులు, అనంతరం ఎంపీటీసీ స్థానాలు, పోలింగ్ కేంద్రాల వారీగా తుదిజాబితాను విడుదల చేస్తారు.10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు. 11వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు. 12న నామినేషన్ల పరిశీలన, అదేరోజు

మిగతా 8వ పేజీలో...

తొలివిడత ఎన్నికల షెడ్యూల్ ఇలా...!


ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు	తొలి విడత
నామినేషన్ల స్వీకరణ మొదలు	ఈ నెల 9
నామినేషన్ల స్వీకరణకు చివరి తేది	ఈనెల 11
నామినేషన్ల పరిశీలన	ఈనెల 12
నామినేషన్ల ఉపసంహరణ	ఈ నెల 15
పోలింగ్ తేదీ	ఈ నెల 23
ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి	నవంబరు 11

మొదటి విడత నల్లగొండ, దేవరకొండ డివిజన్లలో ఎన్నిక జరిగే స్థానాలు..

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ స్థానాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు	లొకేషన్లు
చిట్యాల	12	17,760	17975	0	35,735	60	12
కనగల్లు	12	18313	18579	0	36892	67	33
కట్టంగూరు	13	18,565	18,797	0	37362	63	24
కేతేపల్లి	11	15136	15947	1	31084	55	11
నకిరేకల్	9	13283	13558	2	26843	47	22
నల్లగొండ	13	19166	20063	0	39229	67	32
నార్కట్‌పల్లి	15	21508	22263	1	43772	83	31
శాలిగౌరారం	13	19937	20448	3	40388	70	25
తిప్పర్తి	9	13468	14222	0	27690	48	28
చందంపేట	9	15768	14910	1	30679	64	30
చింతపల్లి	14	22418	22633	3	45054	85	50
దేవరకొండ	11	17909	17806	1	35716	65	41
గుడిపల్లి	5	6066	6205	0	12271	24	13
డిండి	13	20660	20863	2	41525	78	42
గుర్రంపోడు	12	18947	19623	1	38571	74	38
కొండమల్లేపల్లి	9	14992	14604	3	29599	53	30
నేరేడుగొమ్ము	6	10304	9955	3	20262	45	21
పీఏపల్లి	10	13848	13790	6	27644	51	33
మొత్తం	196	298048	302241	27	600316	1099	516

అమ్మో.. ఆఫ్రికా నత్త

- వలస వచ్చిన నత్తలు
- ఉద్యాన పంటలపై దాడి, దిగుబడులపై ప్రభావం
- కూరగాయలు, బత్తాయి, బొప్పాయి పంటలను ఆశిస్తున్న నత్తలు
- గుర్రంపోడు మండలంలో వెలుగులోకి
- అప్రమత్తమైన అధికారులు, శాస్త్రవేత్తలు



ఉద్యాన పంటలకు ఆఫ్రికా నత్తల బెడద మొదలైంది. నత్తల కారణంగా కూరగాయలు, బత్తాయి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. జిల్లాలోని గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన పంటలపై నత్తల దాడి వెలుగులోకి వచ్చింది. దీంతో స్థానిక రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అప్రమత్తమైన ఉద్యాన అధికారులతో పాటు శాస్త్రవేత్తలు ఆయా గ్రామాలను సందర్శించి ఆఫ్రికా నత్తలుగా గుర్తించారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

ఆఫ్రికా నత్తల బెడద కారణంగా ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తగిన సలహాలు, సూచనలు చేసి యాజమాన్య పద్ధతులతో పాటు వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇప్పటికే ఉద్యాన పంటల రైతులు దిగుబడులు రాక, వచ్చిన దిగుబడులకు మద్దతు ధరలు లేక నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆఫ్రికా నత్తలు ఉద్యాన పంటలపై దాడిచేసి నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నత్తలు పెద్ద సంఖ్యలో గుడ్లు పెడుతూ వేగంగా సంతాన ఉత్పత్తి చేయడం వల్ల జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పాటు సరిహద్దు జిల్లాలకు విస్తరించే ప్రమాదం ఉంది.



పిట్టలగూడెంలో నత్తలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి కె.సుభాషిణి, రాజాగౌడ్, మురళి

వలస వచ్చిన ఆఫ్రికా నత్తలు

ఆఫ్రికా నత్తలు దేశంలోని వివిధ ప్రాంతాలకు వందేళ్ల కిందటే వలస వచ్చినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడేళ్ల కిందట తోటలు, పొలాలపై ఆఫ్రికా నత్తలు దాడి ప్రారంభించాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆఫ్రికా నత్తలు విజృంభించాయి. కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి వక్క, శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను నల్లగొండ జిల్లాకు దిగుమతి చేసుకోవడంతో ఆఫ్రికా నత్తలు వాటి వెంట జిల్లాకు చేరి ఉద్యాన పంటలపై ప్రభావం చూపిస్తున్నట్లు శాస్త్రవేత్తలు, అధికారులు గుర్తించారు. ఆఫ్రికా

మిగతా 7వ పేజీలో...



విద్యుత్ దీపాల వెలుగులో లతీఫుల్లా షాఖాద్రి దర్గా స్వాగత ద్వారం

నేటి నుంచి లతీఫుల్లా షాఖాద్రి
ఉర్సు ఉత్సవాలు

ముస్తాబైన దర్గా, నేడు గంధం ఊరేగింపు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక హజ్రత్ సయ్యద్ లతీఫుల్లాషా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు 9న లాంఛనంగా ప్రారంభంకానున్నాయి. ఉర్సు ఉత్సవాలకు దర్గాను అన్ని హంగులతో ముస్తాబు చేశారు. దర్గా ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. గుట్ట మెట్లవద్ద దుకాణాలు వెలిశాయి. 9న సాయంత్రం 5.30 గంటలకు స్థానిక మదీనా మసీద్‌లో గంధానికి ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రికి గుట్ట మెట్ల వద్దకు గంధం చేరగానే ఉర్సు ఉత్సవాలు ప్రారంభవుతాయి. గంధానికి జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై స్వాగతం పలికి ఉత్సవాలను లాంచనంగా ప్రారంభిస్తారు. ఉర్సు గంధంతో పాటు జిల్లా పోలీస్‌శాఖ గంధాన్ని కూడా ఊరేగింపు తీసుకవస్తారు. ఎస్పీ కార్యాలయంలో ప్రార్థనల అనంతరం ఈ ఊరేగింపును ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రారంభిస్తారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి పంకాలు ఊరేగింపుగా వస్తాయి. ఈ ఊరేగింపులో మర్ఫా వాయిద్యాలు ఆకర్షణగా నిలుస్తాయి. యువకుల నృత్యాలు, భక్తి గీతాలు అలరించనున్నాయి. 10న దర్గాలో దీపారాధన, నిరంతరం భక్తులకు అన్నదానం, పాత కలెక్టరేట్ మసీదులో ఖురాన్ పఠనం, ప్రముఖుల సందేశాలు ఉంటాయి. 11న రాత్రి గుట్ట మెట్ల వద్ద కళాకారుల ఖవ్వాలి ఉంటుంది. ఉత్సవాలు అధికారికంగా మూడు రోజులు జరిగినా, నెల రోజుల పాటు కొనసాగుతాయి. దూరప్రాంతాల భక్తులు ఇప్పటికే నల్లగొండకు చేరుకున్నారు. రాష్ట్రంలోని నలుమూలల ప్రాంతాల నుంచే గాక, ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు హాజరవుతారు. ఇదిలా ఉండగా, దర్గా వద్ద ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు.

రైతులకు ఆందోళన అవసరం లేదు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం విక్రయానికి మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం లోపు తేమ ఉండాలని, రైతులు నేరుగా పచ్చి ధాన్యంతో మార్కెట్‌కు వచ్చి కాంటాలు వేయించే ప్రయత్నం చేయకూడదని అన్నారు. మార్కెట్‌లో ధాన్యం ఆరబెట్టే యంత్రం అందుబాటులో ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 72గంటలలోపు రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ అవుతుందన్నారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలిగినా గ్రీవెన్స్ సెల్ 9963407064కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీసీవో పాత్యానాయక్, మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుధాకర్, ఏవో సన్నిరాజు, ఏపీఎం హరి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, తదితరులు ఉన్నారు.



తిప్పర్తి మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

(ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి): రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని గారకుంటపాలెం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, దళారుల మాటలను నమ్మి ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. ఆమె వెంట డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, డీసీఎం సోమయ్య, ఏపీఎం మధుసూదన్, మారెపల్లి లక్ష్మీరెడ్డి, లలిత, సలోమి, నాగమణి, సీసీలు, సిబ్బంది తదితరులు ఉన్నారు. అదేవిధంగా మండలంలోని గుర్రప్పగూడెం, ఆగామోత్కూర్, చిరుమర్తి, పాములపాడు, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీఎం సోమయ్య ప్రారంభించారు.

'కపాస్ కిసాన్' యాప్‌పై అవగాహన కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కలెక్టరేట్): పత్తి కొనుగోలులో రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు 'కపాస్ కిసాన్' యాప్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఉమ్మడి జిల్లా అధికారులకు కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. గత ఏడాది పత్తి విక్రయాల్లో ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం అలాంటి సమస్యలు రాకుండా అవగాహన కల్పించాలన్నారు. యాప్‌లో కౌలు రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులందరూ ఒకేసారి జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకురాకుండా నిర్ణీత షెడ్యూల్‌ను రూపొందించాలని, అందుకు సీసీఐ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద ఓ సహాయకుడిని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గత ఏడాది 3,46,359 మెట్రిక్ టన్నులు పత్తి దిగుబడి వచ్చిందని, అందులో సీసీఐ 1,81,456 మెట్రిక్ టన్నులు, వ్యాపారుల 12,742 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జేడీ శ్రీనివాస్, మార్కెటింగ్‌శాఖ అధికారి ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు చేరని ఓటర్ల జాబితా

నల్లగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి 10 రోజులు గడుస్తున్నా, మరికొన్ని గంటల్లో నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధం అవుతున్నా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఇప్పటికీ ఓటర్ల జాబితాలు ఇవ్వకపోవడాన్ని సీపీఎం నాయకులు నర్సిరెడ్డి ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే గుర్తింపు పొందిన పార్టీలకు ఓటర్ల జాబితాలు ఇవ్వాల్సి ఉంటుందని, ఈ దఫా అలాంటి చర్యలేవీ జిల్లా ఎన్నికల అథారిటీ చేపట్టకపోవడం సరికాదన్నారు. గురువారం అయినా గుర్తింపు పొందిన పార్టీలకు ఓటర్ల జాబితాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఘనంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చిట్టిపోలు యాదగిరి ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలుపుతున్న మిల్లర్లు

సిండికేటైన మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ జగాల్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జగాల్‌రెడ్డి

కనగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సిండికేట్‌గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్న రైస్‌మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గేలి జగాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దోరేపల్లి స్టేజీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్టీఏ సభ్యుడు రాజురెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐకేపీ కేంద్రాల్లో సరైన వసతులులేక, వాతావరణ పరిస్థితులు అనుకూలించక ధాన్యం ఆరబెట్టడం రైతులకు కష్టతరంగా మారిందన్నారు. దీంతో కొంత మంది రైతులు ధాన్యాన్ని మిల్లులకు విక్రయించేందుకు వెళ్తే తరుగు పేరుతో కోతలు పెడుతూ నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. క్వింటా ధాన్యానికి రూ.1,600 నుంచి రూ.1,700కు మించి చెల్లించడం లేదన్నారు. మిల్లర్లు మద్దతు ధర చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పత్తి కొనుగోలు కోసం సీసీఐ కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట కదిరె నాగరాజు, సైదులు, నర్సింహ, తదితరులు ఉన్నారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్
డ్రామా పోటీలు

డీఈవో భిక్షపతి

నల్లగొండ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు 9న జిల్లా కేంద్రంలోని బీఈడీ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవజాతి ప్రయోజనాల కోసం శాస్త్ర సాంకేతికత అనే ప్రధానాంశంపై ఈ డ్రామా పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి నెంబర్ 9848578845లో సంప్రదించాలని కోరారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కొండమల్లేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి ఓపీ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేశ రవి, వైద్యాధికారి ఉషారాణి, రవి, ఉన్నారు.

విద్యార్థినులు బాగా చదువుకోవాలి



హాలియా కేజీబీవీని తనిఖీచేస్తున్న అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్

అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ

హాలియా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. బుధవారం హాలియా కస్తూర్బా బాలికల పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలకు ఏం అవసరాలు ఉన్నాయో గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హైమావతికి సూచించారు. వంటగది, పాఠశాల ఆవరణ, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈవో బొల్లారం భిక్షపతి, ఎంఈవో గుండా కృష్ణమూర్తి, తహసీల్దార్ రఘు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, కనగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తామని డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ మండల పరిధిలోని తొరగల్, ఎం.దుప్పలపల్లి, ఖుదావానిపూర్, నర్సింగ్‌భట్ల, పెద్దసూరారం, చిన్నసూరారం, కనగల్ మండలంలోని లింగాలగూడెం, పర్వతగిరి, కనగల్, జీఎడవల్లి, కురంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు కె.పరుశరాం, పద్మ, ఎంపీడీవోలు యాకుబ్‌నాయక్, సుమలత, ఏవో శ్రీనివాస్, డీపీఎం వీరయ్య, ఏపీఎం వినోద, మదరీ పుష్ప, సీసీలు శైగీత, కారింగు శంకర్, రమేష్, ప్రభాకర్, విజయ, ఐద్దయ్య, ఎస్‌ఆర్‌పీ నాగమణి, పాల్గొన్నారు. అదేవిధంగా ఎం.గౌరారం, అమ్మగూడెం గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను ఏపీఎం దానరి మైసేశ్వర్‌రావ్, కనగల్ పీఏసీఎస్ కేంద్రాన్ని సీఈవో రామచంద్రారెడ్డి ప్రారంభించారు.

నల్లగొండలో భారీ వర్షం

నల్లగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి.

పత్తి కొనుగోలు చేయాలి : సీపీఐ

దేవరకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పల్లా సుదర్శన్‌రెడ్డి కోరారు. వర్షాలు కురుస్తుండటంతో చేతికి వచ్చిన పత్తి తడిసి పత్తి రైతులు గత్యంతరం లేక వ్యాపారులకు తక్కువ రేటుకు విక్రయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తిని క్వింటాల్‌కు రూ.8500 చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి 11వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

కొండమల్లేపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు-2025 తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ హైదరాబాద్ షెడ్యూల్‌లోని ఆదేశాల మేరకు మొదటి విడత నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుదీర్‌కుమార్ తెలిపారు. మొదటి విడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లు అక్టోబరు 9 నుంచి అక్టోబరు 11వ తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ విజయేందర్ స్వీకరించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

న్యూస్ బాక్స్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేరెడ్డి రాంచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయం ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పాఠకులు కోరారు. బుధవారం పలువురు విలేకరులతో మాట్లాడారు. లైబ్రరీ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయని, ఇటీవల కాలంలో ఇద్దరి ద్విచక్ర వాహనాలను చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగావకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, కోచింగ్ సెంటర్లకు వేలాది రూపాయల ఫీజు చెల్లించలేక గ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్నామన్నారు. తమ ద్విచక్ర వాహనాలు దొంగతనానికి గురైతే తిరిగి కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నామని, పోలీసుల పర్యవేక్షణ ఉంచడంతో పాటు లైబ్రరీ ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, సైదులు, ప్రభంజన్, వెంకన్న, వసంతరాజు, సుధాకర్, కిషోర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో వసతుల లేమి

- ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- ఇదీ కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు పరిస్థితి





బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు, బస్టాండ్‌లో మరమ్మతులకు నోచుకోని వాటర్ ఫ్రిడ్జి

కొండమల్లేపల్లి, అక్టోబరు 8(అక్టోబరు): కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి కావడం, నాగార్జున-హైదరాబాద్ రాష్ట్ర రహదారి కావడంతో కొండమల్లేపల్లి నాలుగు రోడ్ల కూడలితో ఉండటంతో వాహనాల రద్దీ నెలకొంది. ఆర్టీసీ బస్టాండులో కనీసం తాగడానికి నీరు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఇదే అదునుగా భావించిన ఆర్టీసీ బస్టాండులోని ప్రైవేటు దుకాణదారులు వాటర్ బాటిళ్లు, బిస్కెట్స్, తిను బండారాలు అధిక రేట్లకు అమ్ముతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి వాటర్ ఫ్రిడ్జిను ఏర్పాటు చేసింది. ఏర్పాటు చేసిన కొద్ది రోజుల వరకు తాగునీరు అందించారు. ఆ తర్వాత పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దాదాపుగా ఏడాది దాటినా దానికి మరమ్మతులు చేయడంలో విఫలమయ్యారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండుకు లక్షల్లో ఆదాయం వస్తున్నా ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ

గుర్రంపోడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. గుర్రంపోడు మండలం కొప్పోలు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారంపై చిన్నారుల తల్లులకు, బాలింతలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని అన్నారు. ఆకు కూరలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ, ఏఎన్‌ఎం సాలమ్మ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

వీటీనగర్‌లో నీటి కోసం ఇబ్బందులు

- పట్టించుకోని అధికారులు

చింతపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామ పంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)లో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. కోత వేటు దూరంలో రిజర్వాయర్ ఉన్నా అధికారుల నిర్లక్ష్యమో, ప్రజాప్రతినిధుల అలసత్వమో కానీ పట్టణంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా మిషన్‌భగీథర నీరు సక్రమంగా రావడం లేదు. దీంతో పాటు బోరుబావుల నుంచి నీటి సరఫరా కావడం లేకపోవడంతో ఆటో ట్యాంకుల ద్వారా రూ.800 నుంచి 1000 ఖర్చు చేసి కొనుగోలు చేసుకొని పరిస్థితి ఏర్పడింది. అంగట్లో అన్నీ ఉన్న అల్లుని నోట్లో శని ఉన చందంగా తయ్యారైంది. తాగునీటి పరిస్థితి ప్రభుత్వాలు మారిన అధికారులు మారిన తాగునీటి సరఫరా విషయంలో విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టిసారించి నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

చింతపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు చేసే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. చింతపల్లి మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక దళారులు గ్రామాల్లోకి చేరుకొని ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి చేనుల్లో నీరు చేరి పంట నష్టం జరిగిందన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా,అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం వల్ల యువకుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. జైవీర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హాలియాలో ఏర్పాటు చేసిన జైవీర్ ప్రీమియల్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల ముగింపు సమావేశానికి హాజరై మాట్లాడారు. క్రీడలో గెలుపు ఓటములు సహజమని నేటి ఓటమి రేపటి గెలుపునకు పునాది అయ్యేలా కృషి చేయాలని అన్నారు. క్రీడల ద్వారా యువకుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగవుతాయన్నారు. వారం రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహించడానికి శ్రమించిన యువజన కార్యకర్తలను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి, నాయకులు ఉపేందర్‌రెడ్డి, ఆంజనేయులు, అమరేందర్‌రెడ్డి, నాగరాజుయాదవ్, మల్లిఖార్జున్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో రికార్డు సాధించడం అభినందనీయం

కరాటే పోటీల్లో గిన్నిస్ రికార్డు సాధించిన చిన్నారుల ప్రతిభ అభినందనీయమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హాలియాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరాటేలో ప్రతిభ కనబరిచిన పాతనబోయిన సంతోష్‌కుమార్ చిన్నారులు శ్రీహస్, సువిక్ష ప్రతిభను అభినందించి వారి కోరిక మేరకు మొక్కను నాటారు. కరాటేలో వీరి ప్రతిభ పలువురికి ఆదర్శనీయమని, మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, ఆంజనేయులు, పాతనబోయిన సంతోష్‌కుమార్, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నేడే నోటిఫికేషన్


(5వ పేజీ తరువాయి)

సాయంత్రం వెల్లుబాటయ్యే నామినేషన్ల సంఖ్యను అధికారులు ప్రకటిస్తారు. 15వ తేదీ సాయంత్రం 3గంటలవరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు సాయంత్రం 3గంటల తర్వాత బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 23వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఏ కేంద్రంలోనైనా రీపోలింగ్ అవసరమైతే ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు మరునాడు ఎన్నిక నిర్వహిస్తారు. 23వ తేదీ పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు. నవంబరు 11వ తేదీ ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, లెక్కింపు పూర్తయిన వెంటనే విజేతలను ప్రకటిస్తారు.

నోటిఫికేషన్ జారీకి అంతా సిద్ధం : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీన మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడారు.

మొదటి విడత 18 జడ్పీటీసీలు, 196 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందుకు ఆర్వోలు, ఎంపీడీవోలకు శిక్షణ పూర్తి చేశామని వివరించారు. నామినేషన్ కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. అంతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



హాలియా : బాకీ కార్డులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

మోసకారి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి



పీఏపల్లిలో కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నాయకులు

- ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ
- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆరు గ్యారెంటీల మోసాన్ని 420 హామీలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన ప్రతీ కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వం పొంది మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షలు అందజేస్తున్నామని అన్నారు. అనంతరం గుడిపల్లి మండలం ఘనపురం గ్రామానికి పలువురు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యోల్లుri వల్లపురెడ్డి, బీసీ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి మహేందర్, మునగాల అంజిరెడ్డి, అర్వపల్లి నర్సింహ,ఎర్ర యాదగిరి, మాద సుదాకర్‌గౌడ్, రాయనబోయిన శ్రీనుయాదవ్, దామోదర్‌నాయక్, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాకీ కార్డుతో అవగాహన కల్పించాలి : భగత్

హాలియా: కాంగ్రెస్ బాకీ పడిన హామీలను కాంగ్రెస్ బాకీ కార్డుతో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియాలోని తన నివాసంలో బుధవారం గుర్రంపోడు మండల ముఖ్య నాయకుల, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి అనంతరం కాంగ్రెస్ బాకీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే అన్ని అమలు చేస్తామని అన్నారు. 22 నెలలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డులను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రాము

పెద్దవూర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లెర్నింగ్ విద్యా బోధనపై గణిత, భౌతికశాస్త్రాల ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో ఎంఈవో తరి రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల నిర్వహణ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గణిత, భౌతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీలు అరవింద్‌రెడ్డి, భాస్కర్, అనిల్, రాములు, సైదులు, వాలియా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లోలెవల్ కల్వర్టులతో ఇబ్బందులు

చింతపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రం నుంచి రాయినిగూడెం గ్రామానికి వెళ్లే దారిలో నాలుగు లోలెవల్ కల్వర్టులు ఉన్నాయి. నిత్యం ఈ రహదారి గుండా గ్రామస్థులు మండల కేంద్రానికి స్వంత పనుల నిమిత్తం వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులోకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కల్వర్టులు లోలెవల్‌గా నిర్మించడంతో వర్షకాలం సమస్య జటిలంగా మారింది. ఈ విషయంపై ప్రజాప్రతినిధులతో పాటు, సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయి గ్రామాల్లో పర్యటించి సమస్యను గుర్తించి హైలెవల్ కల్వర్టు ఏర్పాటు చేసి ససమస్య పరిష్కారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చల్ల గంగమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గొల్లగూడలో పలువురికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు చల్ల వెంకన్న, లక్ష్మి మాట్లాడుతూ గూడానికి సేవ చేయాలన్న ఆలోచనలతో ఎన్నారైలు పవన్, చక్రి సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. విద్య, వైద్య, సామాజిక రంగాల్లో ఉచిత సేవలందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి, నిరుపేద బాలికలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దారం మల్లేష్, బొడ్డు రమేష్, చిమ్మట వెంకటరామయ్య, చల్లా నర్సింహ, రియాజ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన కల్పించాలి

పెద్దవూర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 సంవత్సరాలైన సందర్భంగా మండల కేంద్రంలో సమాచార హక్కు చట్టం ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త తగరం శ్రీను కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌హెచ్‌ఎంహెచ్‌ఎల్ అధ్యక్షుడు క్రాంతికుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం రూపొందించిన అత్యంత ముఖ్యమైన చట్టాల్లో సమాచార హక్కు చట్టం ఒకటని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని మనమందరం వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న క్రాంతికుమార్

కుంటను తలపిస్తున్న వర్షపు నీరు

కొండమల్లేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆది, సోమవారాల్లో కురిసిన భారీ వర్షాలకు కొండమల్లేపల్లి మండల పరిధిలోని పలు కాలనీలతో పాటు దేవరకొండ రోడ్డులో గల ప్రెస్‌కాలనీ వెనుక భాగంలో నీరు చేరి కుంట మాదిరిగా తయారైంది. దేవరకొండ రోడ్డు మెగా సిటీ కాలనీలో ఇళ్లు అనుకొని పూర్తిగా వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో ఇళ్లలో విషసర్పాలు, దోమల బెడద అధికంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కొంతమంది వ్యక్తులు వెంచర్ చేసి చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు ఇందులోకి చేరుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో సుదీర్‌కుమార్‌ను వివరణ కోరగా సమస్య తన దృష్టికి వచ్చిందని నీరు చేరిన కాలనీలో వర్షపు నీరు బయటికి పంపేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.